క్లుప్తంగా

నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లు కేటాయించాలని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన తెలిపి తహసీల్దార్ వెంకటలక్ష్మికి వినతిపత్రం అందించారు. ప్రభుత్వం స్థలమున్న వారికి రూ.3లక్షలు ఇస్తామని నమ్మించి మోసం చేస్తోందని ఆరోపించారు. స్థలమున్న పేదలకు ఇంటినిర్మాణం కోసం రూ.5లక్షలు ఇవ్వాలని, ఎంపిక చేసిన లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. నాయకులు సీపెల్లి రవీందర్, జ్యోతి, అశోక్, ప్రశాంత్, శ్రావణ్, నవీన్ తదితరులున్నారు.

సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందిస్తున్న లావణ్య

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్‌లోని గౌతమిరూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం ట్రస్టు ఆధ్వర్యంలో మగ్గం, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ పొందిన విద్యార్థులకు ట్రస్టీ నిర్వాహకురాలు లావణ్య సర్టిఫికెట్లు అందించారు. లావణ్య మాట్లాడుతూ.. పదేళ్లుగా రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ, మగ్గం, ఎలక్ట్రికల్ విభాగాల్లో శిక్షణ ఇచ్చి మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ట్రస్టు ద్వారా శిక్షణ పొందిన మహిళలు ప్రతినెల రూ.20 నుంచి 25వేల వరకు ఆదాయం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మాతంగి రేణుక, ట్రస్ట్ ట్రైనీ శిరీష, సరోజ, రమ, సౌమ్య, అక్షయ, కావ్య, నవ్య, పద్మ, సుజాత, రాజ్యలక్ష్మి, రిజ్వాన, జయశ్రీ, జ్యోతి, శిరీష, శివాని పాల్గొన్నారు.

పద్మశాలీలకు అవకాశమివ్వండి

పెద్దపల్లిరూరల్: రాష్ట్రప్రభుత్వం బీసీల కోసం అమలు చేస్తున్న రూ.లక్ష సాయం పథకం కింద పద్మశాలీలకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలివ్వాలని పద్మశాలీ సేవా సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దాసరి ఉష డిమాండ్ చేశారు. పెద్దపల్లి పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్దకు చేరుకుని నిరసన తెలిపి బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రంగారెడ్డికి వినతిపత్రం అందించారు. బీసీలకు రూ.లక్ష సాయం పథకం అమలు చేస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం కొన్ని కులాలకే పరిమితం చేయడం సరికాదన్నారు. వెంటనే ఈ పథకాన్ని పద్మశాలీలకు వర్తింపజేస్తున్నట్లు ఆదేశాలివ్వాలన్నారు. నాయకులు మొండయ్య, రాజయ్య, వైకుంఠం శంకరయ్య, సదానందం, శ్రీనివాస్, పురుషోత్తం, బూర్ల సూర్యకుమార్, మహేశ్ ఉన్నారు.

బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రసన్నకుమార్



గోదావరిఖని: బీఎస్పీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జిగా గోలివాడ ప్రసన్న కుమార్‌ను నియమించినట్లు జిల్లా ప్రధానకార్యదర్శి ఇరికిల్ల రాజనర్సయ్య తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మరో ఇన్‌చార్జిగా జినుక ఉదయ్, ఉపాధ్యక్షుడిగా కాసిపేట స్వామి, అధ్యక్షుడిగా కుర్మ శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మారపెల్లి రవికుమార్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా ఈదునూరి ధర్మరాజు, కార్యదర్శిగా మున్నాభాయ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జనగామ మల్లేశ్, సిరికొండ రవి, గద్దం శంకర్, శ్రావణ్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు వందల కోట్లా..?

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలకు వందల కోట్లు కేటాయించి.. మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బిల్లులు ఇచ్చేందుకు బడ్జెట్ లేదనడం విడ్డూరంగా ఉందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలల బిల్లు చెల్లించాల్సి ఉందన్నారు. మధ్యాహ్న భోజన పథకం జిల్లా ప్రధాన కార్యదర్శి పూసల రమేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓదెల రమేశ్ మాట్లాడుతూ.. భోజన కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, పెండింగ్ బిల్లులు చెల్లించి ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం మండల అధ్యక్షురాలు లావణ్య, ప్రధాన కార్యదర్శి రత్నమాల, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో తెలంగాణ హరితోత్సవం



సుల్తానాబాద్‌లో.. మున్సిపల్ చైర్ పర్సన్ ముత్యం సునీత



ధర్మారంలో.. ఎంపీపీ కరుణశ్రీ, జెడ్పీటీసీ పద్మజ



పన్నూర్‌లో.. ప్రజాప్రతినిధులు

పాలకుర్తి/జూలపల్లి/కమాన్‌పూర్/రామగుండం/ఓదెల/ఎలిగేడు/ధర్మారం/యైటింక్లయిన్‌కాలనీ/సుల్తానాబాద్: పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో సోమవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ హరితోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీ పాలకవర్గాల ఆధ్వర్యంలో ఊరూరా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మహిళలకు ముగ్గులపోటీలు నిర్వహించి అధికారులు ప్రజాప్రతినిధులు ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతులు అందించారు. అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ అంతర్గాం పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో, యైటింక్లయిన్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో గోదావరిఖని టూటౌన్ సీఐ సూరారం వేణుగోపాల్ ముమ్మరంగా మొక్కలు నాటారు. మొక్కల సంరణ బాధ్యతగా చేపట్టాలన్నారు.



మారేడుపల్లిలో.. ఎంపీపీ అనసూర్య, ఎంపీడీవో



అంతర్గాంలో మొక్క నాటుతున్న ఎస్సై, సిబ్బంది



యైటింక్లయిన్‌కాలనీలో.. సీఐ వేణుగోపాల్

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

పెద్దపల్లిరూరల్/సుల్తానాబాద్/కాల్వశ్రీరాంపూర్/కమాన్‌పూర్/రామగుండం/ధర్మారం/జూలపల్లి/మంథని/ఎలిగేడు: పెద్దపల్లి, రామగుండం, మంథని నియోజకవర్గాల్లో సోమవారం ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పుట్టినరోజు వేడుకలను పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయాలు, ప్రధాన వీధుల్లో కేక్ కట్‌చేసి స్వీట్లు పంచిపెట్టారు. రానున్న రోజుల్లో రాహుల్‌గాంధీ నాయకత్వంలో దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పలువురు ధీమావ్యక్తంచేశారు. కాల్వశ్రీరాంపూర్‌లో గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన యువకులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరడంతో వారికి టీపీసీసీ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. సుమారు 100 మంది కాంగ్రెస్‌లో చేరారు. రామగుండం పట్టణంలోని తబితా ఆశ్రమంలో ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి జనక్‌ప్రసాద్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు వాజీద్‌ఖాన్ నేతృత్వంలో చిన్నారులకు అన్నదానం చేశారు. అబాది రామగుండంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్‌బుక్కులు అందించారు. సుల్తానాబాద్ మండలకేంద్రంలో బ్లాక్ కాంగ్రెస్ చైర్మన్ దామోదర్‌రావు, కాల్వశ్రీరాంపూర్‌లో పీసీసీ ఉపాధ్యక్షుడు పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు, ధర్మారంలో ధర్మపురినియోజకవర్గ సీనియర్ నాయకుడు గజ్జెలస్వామి, కమాన్‌పూర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, పెద్దపల్లిరూరల్‌లో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సురేశ్‌గౌడ్, ధర్మారంలో మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు.



కాల్వశ్రీరాంపూర్‌లో వేడుకలు నిర్వహిస్తున్న పీసీసీ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే విజయరమణా రావు

సంపద వనాల అభివృద్ధి

మంథని: నీటిపారుదల శాఖ పరిధిలోని భూముల్లో మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు కలెక్టర్ సంగీత తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంథని మండలం సిరిపురం సమీపంలోని పార్వతీ బ్యారేజి వద్ద సంపద వనాలను కలెక్టర్ ప్రారంభించారు. ఎస్సారెస్పీ కాలువ వెంబడి, నీటి వనరుల వద్ద గుర్తించిన స్థలంలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షిస్తామన్నారు. అటవీ, గ్రామీణాభివృద్ధి, మున్సిపల్ శాఖలు సమన్వయంతో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. అడిషనల్ కలెక్టర్ కుమార్ దీపక్, డీఆర్‌డీఏ శ్రీధర్, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పార్వతీ బ్యారేజీ భూమిలో మొక్క నాటుతున్న కలెక్టర్

బీఎస్పీ నూతన కార్యవర్గం

గోదావరిఖనిటౌన్: స్థానిక బీఎస్పీ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రామగుండం నియోజకవర్గ అసెంబ్లీ అధ్యక్షుడిగా కాసిపేట స్వామి, ఇన్‌చార్జీలుగా జింక ఉదయ్, గోలివాడ ప్రసన్నకుమార్, బీసీ అసెంబ్లీ ఉపాధ్యక్షుడిగా కుర్మ శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా మారపెల్లి రవికుమార్, సెక్రటరీగా ఎస్‌డీ. మున్నాభాయ్, కోశాధికారిగా మహేశ్, ఈసీ మెంబర్‌గా ఈదునూరి ధర్మరాజును ఎన్నుకున్నారు. గొట్టె రాజన్న, బాల కళ్యాణ్ పంజా, ములుమూరి శేఖర్, ఇరికిల్ల రాజనర్సయ్య, వరికిల్ల మల్లేశ్ పాల్గొన్నారు.

గ్రామకమిటీ ఎన్నిక..

కాల్వశ్రీరాంపూర్: మాజీ ఎంపీపీ సారయ్య గౌడ్ నేతృత్వంలో నిర్వహించిన కాల్వశ్రీరాంపూర్ కాంగ్రెస్ గ్రామశాఖ ఎన్నికల్లో అధ్యక్షుడిగా అల్లంల దేవేందర్ యాదవ్, ప్రధానకార్యదర్శిగా గోలి సుధాకర్, యువత గ్రామశాఖ అధ్యక్షుడిగా రాణవేన క్రాంతి, ప్రధాన కార్యదర్శిగా కొంతం మధుకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మునీర్, ఎంపీటీసీ రావి సదానందం, ఏఎంసీ డైరెక్టర్ సబ్బని రాజమల్లు, మత్స్యపారిశ్రామిక సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు బాజీ పటేల్, సతీశ్, శ్రీనివాస్, సదానందం యాదవ్, బంగారి రమేశ్, రమణయ్య, సుధాకర్, దేవేందర్ యాదవ్, దాగేటి రాంచంద్రం, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింకురోడ్ల నిర్మాణానికి కృషి

ఎలిగేడు: గ్రామాలను కలిపే లింకురోడ్ల నిర్మాణానికి కృషిచేస్తున్నట్లు ధూళికట్ట సర్పంచ్ గొల్లే కావేరి తెలిపారు. ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలోని ఊరచెరువు నుంచి జూలపల్లి మండలం తేలుకుంట వెళ్లే రోడ్డు మార్గానికి మట్టి పోసేందుకు సోమవారం ఎమ్మెల్సీ సీడీపీ నిధులు రూ.5లక్షలతో పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కో ఆర్డినేటర్ నరినేని సుధాకర్‌రావు, మాజీ ఎంపీటీసీ గొల్లే భూమేశ్, ఇరుగురాల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం

జ్యోతినగర్: త్రిశూల్ యూత్ సహకారంతో ఏర్పాటుచేసిన వైద్యశిబిరానికి స్పందన లభించింది. సోమవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని కార్పొరేటర్ మంచికట్ల దయాకర్ ప్రారంభించారు. కరీంనగర్ వస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో డాక్టర్లు సాయికృష్ణ, మహిపాల్, జ్యోత్స్న 500 మంది పేదలకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు అందించారు. త్రిశూల్ యూత్ ప్రెసిడెంట్ పల్లికొండ నాగరాజు, వైస్‌ప్రెసిడెంట్ మేడి మహేశ్, నవీన్‌కుమార్, నాగరాజు, సందీప్, దుర్గాప్రసాద్, రమేశ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జర భద్రం...!

కోల్‌సిటీ: గోదావరిఖని గాంధీచౌక్ సమీపంలోని అంబేడ్కర్ నగర్ బోర్డు ముందు ప్రధాన రహదారి మధ్యలో మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన కంపాక్టర్ బిన్(చెత్త డబ్బా)ను నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో వాహనదారులు గుర్తించకుండా వెళ్తే, ప్రమాదం జరిగే అవకాశం ఉంది. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు కంపాక్టర్ వాహనంలో చెత్తను పడేసే సమయంలో వదిలేస్తున్నారా? లేకుంటే ఎవరైనా ఆకతాయిలు ఇలా రోడ్డు మధ్యలోకి కంపాక్టర్ బిన్‌ను నెడుతున్నారా? అనే విషయాలను స్థానికులు చెప్పలేక పోతున్నారు. ప్రమాదాలు చోటు చేసుకోకముందే బల్దియా అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



రహదారి మధ్యలో ఉన్న కంపాక్టర్ బిన్

విద్యాదినోత్సవానికి ఏర్పాట్లు

జూలపల్లి: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. మన ఊరు–మనబడి పథకంలో ఎంపికై నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాలలను, పథకంలో మరమ్మతులకు ఎంపికైన బడులను ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. కాచాపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను ప్రారంభించేందుకు ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి, ఎంపీపీ రమాదేవి, మండల స్థాయి అధికారులు వస్తున్నట్లు సర్పంచ్ ఎల్లయ్య తెలిపారు.

నాణ్యత లేకుండా రోడ్డు పనులు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని గర్రెపల్లి నుంచి సుల్తానాపూర్, ఐతరాజుపల్లి మీదుగా దుబ్బపల్లి వరకు వేస్తున్న రోడ్డు పనుల్లో నాణ్యత పాటించడం లేదని ఐతరాజుపల్లి వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. సుల్తానాపూర్ రోడ్డు నుంచి దుబ్బపల్లి వరకు 4 కిలోమీటర్ల మేర డీఎంఎఫ్‌టీ నిధులు రూ.1.23 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో రోడ్డు మరమ్మతులు పూడ్చి, బీటీ రోడ్డు పనులు చేపట్టేందుకు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నాణ్యత లేకుండా పనులు చేపడుతున్నాడని వార్డు సభ్యులు మడ్డిసాయి రాజిరెడ్డి, మమత, పోచాలు, మధురమ్మ, స్వరూప తెలిపారు. నాణ్యత లేకుండా చేపట్టడంతో మళ్లీ మొదటికే వస్తుందని, ప్రభుత్వం కేటాయించిన నిధులు రోడ్డుపాలు అవుతున్నాయని ఆరోపించారు. అధికారులు స్పందించి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా రోడ్డు పనులు జరిగేలా చూడాలని వార్డు సభ్యులు కోరారు.



నాణ్యత లేకుండా చేపట్టిన బీటీ రోడ్డు

రక్షణ లేని ఓపెన్ జిమ్ పరికరాలు



పెద్దపల్లిరూరల్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలకు రక్షణ కరువైంది. గుర్తుతెలియని వ్యక్తులు పరికరాలను విరగ్గొట్టి ఎత్తుకెళ్లేందుకే విరగగొట్టి ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనం నిర్మించాలి

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో బీఆర్ అంబేడ్కర్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించి నిర్మించాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేశ్ కార్పొరేటర్ రమణారెడ్డిని కోరారు. ఈమేరకు సమతా సైనిక దళ్ ఎన్టీపీసీ పట్టణ కమిటీ సభ్యులు ఇందిరమ్మ కాలనీకి రహదారిని నిర్మించినందుకు కార్పొరేటర్ రమణారెడ్డి నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అంబేడ్కర్ భవన నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ కాలనీలో అంబేడ్కర్ భవన నిర్మాణానికి 20 గుంటల స్థలం కేటాయించి, రూ.కోటితో భవనం నిర్మించాలని కోరారు. కుల వృత్తులను ప్రోత్సహిస్తూ ఎన్నో కులాలకు సంక్షేమ భవనాలు నిర్మించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేతో, ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తప్పకుండా అంబేడ్కర్ భవన నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమతా సైనిక దళ్ నాయకులు వసంతరావు, దుర్గం లింగయ్య, ముడి మడుగుల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ఇప్పించాలని తహసీల్దార్‌కు వినతి

సుల్తానాబాద్: బీసీ రుణాల కోసం కులం, నివాసం ఆదాయం సర్టిఫికెట్లను అందించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట వివిధ గ్రామాల ప్రజలు నిరసన తెలిపారు. పలువురు మాట్లాడుతూ... వారంరోజులుగా మీసేవ కార్యాలయానికి వచ్చినప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యంతో సర్టిఫికెట్లు చేతికందడం లేదని ఆరోపించారు. విధులకు ఆలస్యంగా వస్తున్నారని సమయం కాకముందే ఇంటికి వెళ్తున్నారన్నారు. సర్వర్ డౌన్ ఉందంటూ తప్పించుకుంటున్నారని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సర్వర్ మెరుగుపరిచేలా చూడాల్సిన బాధ్యత సిబ్బంది, అధికారులపై ఉందన్నారు. అధికారులు స్పందించి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సర్టిఫికెట్లు మంజూరు చేయాలని కోరారు. నిరసన సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ యాకన్న లబ్ధిదారులతో మాట్లాడి నిరసన విరమింపజేశారు. లబ్ధిదారులకు వెంటనే సర్టిఫికెట్లు వచ్చేలా చూస్తానని హామీ ఇచ్చారు. పలుగ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

మంథని/కమాన్‌పూర్/జూలపల్లి: రూ. ఐదువేల కోట్లతో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ కాపు కులస్తులు సోమవారం మంథని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ప్రతి జిల్లాకేంద్రంలో మున్నూరు కాపు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా వసతిగృహం, ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో మున్నూరు కాపు సంఘం భవన నిర్మాణానికి స్థలం కేటాయించి రూ.రెండు కోట్లు నిధులు మంజూరుచేయాలని కోరారు. కమాన్‌పూర్‌లోరామగిరి తహసీల్దార్‌కు మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కుడిది చలం ఆధ్వర్యంలో తహసీల్దార్ రాంమోహన్‌కు వినతిపత్రం అందించారు. జూలపల్లిలో మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు నాడెం మల్లయ్య స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ డీటీ, అబూబాకర్‌కు వినతిపత్రం అందించారు. వినతిపత్రం అందించిన వారిలో డివిజన్ కో–ఆర్డినేటర్ ఆకుల కిరణ్, మండల కో–ఆర్డినేటర్ కండె రమేశ్, పట్టణ శాఖ కో–ఆర్డినేటర్ కొట్టె రమేశ్, నాయకులు ఎడ్ల సదాశివ్, కొత్త బాలయ్య, కొట్టె సంపత్, పుట్ట రాములు, పుప్పాల తిరుపతి, మండల కో కన్వీనర ఆడప లక్ష్మన్, ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్,సభ్యులు బండి రాజయ్య, కుంటూరి రాజయ్య, గుమ్మడి రాజన్న, శంకరయ్య, రమేశ్ తదితరులు ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం

మంథని: కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో కాషాయజండా ఎగరడం ఖాయమని ఆపార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గడ్డం వివేక్ అన్నారు. మంథనిలోని పార్టీ కార్యాలయంలో సంయుక్త మోర్చా, సీనియర్ నాయకులతో సమావేశమయ్యారు. కేసీఆర్ నియంత, కుటుంబపాలనపై ప్రజలు విసుగుచెందారని, మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, బీజేవైఎం రాష్ట్ర ప్రధానకార్యదర్శి అరుణ్‌కుమార్, పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్, కో–కన్వీనర్ నాంపల్లి రమేశ్, మండల ఇన్‌చార్జి వీరబోయిన రాజేందర్ పాల్గొన్నారు.

మట్టి మాఫియాకు మంత్రి అండ

పెద్దపల్లిరూరల్: మంత్రి కొప్పుల ఈశ్వర్ అండదండలతో ధర్మారం మండలం రచ్చపల్లి చెరువు నుంచి అక్రమంగా మట్టి తరలిపోతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చిలారపు పర్వతాలు, రాంచందర్, పార్లమెంట్ కన్వీనర్ మల్లికార్జున్‌తో కలిసి మాట్లాడారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారం,మంత్రి అండతో మట్టిమాఫియా పేట్రేగిపోతోందన్నారు. మట్టి తరలింపు అంశాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినందుకు భీమారపు సంపత్‌పై దాడి చేశారన్నారు. నాయకులు తంగెడ రాజేశ్వర్‌రావు, లక్ష్మణ్, మేకల శ్రీనివాస్, రాజం మహంత, సంపత్ రావు, రేణుక, మల్లేశ్, శ్రీకాంత్, మధు ఉన్నారు.

నిరుపేదలపై నిర్బంధాన్ని నిలిపివేయాలి

రామగుండం: ఇటీవల ఎన్టీపీసీ పీకే రామయ్య కాలనీ, ఇందిరమ్మకాలనీ, మేడిపల్లి శివారులోని ప్రభుత్వ భూముల్లో ఇళ్లులేని నిరుపేదలు గుడిసెలు వేసుకున్న వారిని నిర్బంధించడం ఆపివేయాలని నిరుపేదలు నిర్మించుకున్న ఇళ్లస్థలాలకు సత్వరమే పట్టాలు జారీచేయాలని ప్రజాసంఘాల పోరాట వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం నిరుపేద ప్రజలతో కలిసి రామగుండం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజాసంఘాల ప్రతినిధులు శాంతియుతంగా ఆందోళన చేపట్టారు.నిరుపేదలకు నివేశన స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకున్న నిరుపేదలకు 125 గజాల స్థలానికి పట్టాలు జారీచేయాలని, గృహనిర్మాణానికి కేంద్రం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.ఐదు లక్షలు చెల్లించాలని, సత్వరమే డబుల్‌బెడ్రూం ఇళ్లను పూర్తిచేసి అర్హులకు పంపిణీ చేయాలన్నారు. స్థలం లేని నిరుపేదలకు స్థలం చూపించి రూ.ఐదు లక్షల పరిహారం ఇవ్వాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు. ఈ ఆందోళనలో ప్రజాసంఘాల ప్రతినిధులు వేల్పుల కుమారస్వామి, వై.యాకయ్య, మహేశ్వరీ, రామాచారి, టీఎల్‌పీ ప్రతినిధి గౌర్రె రమేశ్, భిక్షపతి, శంకర్, సారయ్య లావణ్య, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

ట్రాక్టర్ డ్రైవర్ల స్కిల్డ్ వేతనాలకు అంగీకారం

జ్యోతినగర్: సింగరేణిలోని వివిధ ఏరియాల్లో సివిల్ డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు చెల్లించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించి సర్క్యులర్ విడుదల చేసిందని, ఏఎల్‌సీ (సెంట్రల్) వద్ద ఒప్పందం కుదిరిందని సింగరేణి కాంటాక్ట్ కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు తెలిపారు. సోమవారం ఏఎల్‌సీ (సెంట్రల్)వద్ద జరిగిన చర్చల్లో అంగీకారం కుదిరిందన్నారు. స్కిల్డ్ వేతనాలు చెల్లించేందుకు అంగీకరించిన సింగరేణి డైరెక్టర్(పా)ఎన్. బలరాంకు, జనరల్ మేనేజర్ (పర్సనల్) కుమార్ రెడ్డి, ఏజీఎం పర్సనల్ కవితా నాయుడు, సింగరేణి పర్సనల్ అధికారులు అశోక్, తిరుపతితో పాటు వేతన ఒప్పందంకు సహకరించిన డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) డి.శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. జి. రంజిత్, రాజు, వినోద్‌లు పాల్గొన్నారు.



ఏఎల్‌సీ సమక్షంలో కార్మిక సంఘం నాయకులు